నిట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నరేంద్రకుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-ఖాజీపేట

మండలం పరిధిలోని బి.తిప్పాయపల్లెకు చెందిన గంగిరెడ్డి నరేంద్ర కుమార్‌రెడ్డి కాలికట్ నిట్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా (రెగ్యులర్) ఎంపిక య్యారు. ఈయన తల్లిదండ్రులు గంగిరెడ్డి చెన్నారెడ్డి, నాగేశ్వరమ్మ దంపతులు. నరేంద్ర కుమార్‌రెడ్డి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం సాధించడం పట్ల గ్రామస్తులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. కష్టపడి చదివి ఉన్నత స్థానానికి చేరుకోవడం సంతోషంగా ఉందని కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తపరిచారు.

బిల్లుల మోత.. ప్రజలకు వాత



పేద, ధనిక అని తేడా లేకుండా విద్యుత్ ఛార్జీలు పెరిగిపోయాయి. వినియోగాదారుడు విద్యుత్ బిల్లులు చూస్తే షాక్‌కు గురయ్యే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం రకరకాల ఛార్జీల పేరుతో అదనంగా వసూలు చేస్తోంది. దీంతో సామాన్య ప్రజలు అల్లాడి పోతున్నారు. ప్రభుత్వాలు వసూలు చేస్తున్న అదనపు భారాలను వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అదనపు వసూళ్లపై వినియోగదారుల అభిప్రాయమాలిక.

- ప్రజాశక్తి-యంత్రాంగం

అధిక బిల్లులతో ఇబ్బందులు

విద్యుత్ బిల్లులు అధికంగా వస్తుండడంతో కుటుంబంపై ఆర్థిక భారం పడుతోంది. గతంలో కరెంటు బిల్లు ఇంటికి రూ.300 వచ్చేది. అంతే యూనిట్లు కాల్చినా ప్రస్తుతం రూ. 600 వస్తోంది. నా చిల్లర అంగడికి గతంలో రూ.600 వచ్చేది. ఇప్పుడు రూ.900 వస్తోంది. బిల్లులో అడిషనల్ పేరుతో రకరకాల ఛార్జీలు వేస్తున్నారు.

-శ్రీనువాసులు, వేంపల్లె.

రూ.150 అదనపు బిల్లు

ప్రతి నెల రూ. మూడు వందల నుంచి రూ.350 వచ్చే బిల్లుకు ఈ నెల అదనంగా రూ.150 సర్దుబాటు ఛార్జీలను కలిపారు. దీంతో రూ. 520 కరెంట్ బిల్లు వచ్చింది ప్రభుత్వం అనేక రకాల ఛార్జీలను కలుపుతూ అధిక భారం మోపుతోంది. బిల్లులో దాదాపు సగం సర్దుబాటు చార్జీలు వేశారు. పేద ప్రజలకు చాలా ఇబ్బందిగా ఉంది

- హరి, మైదుకూరు.

ఛార్జీలు తగ్గించాలి

ప్రభుత్వం ట్రూ ఆఫ్, సర్ ఛార్జీలతో పెంచి సామాన్య వ్యాపారులపై అధికభారం మోపింది. అధిక బిల్లులు చూసి చిన్న వ్యాపారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గతంలో రూ. 200 వచ్చే బిల్లు ప్రస్తుతం రూ. 900 వచ్చింది. ప్రభుత్వం వెంటనే విద్యుత్ ఛార్జీలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలి.

-గుర్రంపాటి విశ్వనాథరెడ్డి, కూల్ డ్రింక్ షాప్ యజమాని, వల్లూరు.

బిల్లు ముట్టుకుంటే షాక్

నిత్యావసర, కూరగాయల రేట్లు ఆకాశానంటుతున్న నేపథ్యంలో విద్యుత్ ఛార్జీలు సామాన్యుడిపై పెనుభారం మోపింది. నెలనెలా వచ్చే విద్యుత్ బిల్లును ముట్టుకుంటే షాక్ కొడుతోంది. మధ్యతరగతి, పేదలకు బిల్లులు కట్టలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

- యం.లక్ష్మీనారాయణమ్మ, గృహిణి, బద్వేలు.

ఛార్జీలు పెంచడం అన్యాయం

రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచడం అన్యాయం. పేద, మధ్య తరగతి వారు బిల్లులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. వాడిన యూనిట్లు కంటే అదనపు ఛార్జీలే ఎక్కువగా ఉంది. అద్దె ఇళ్లల్లోని వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే అదనపు ఛార్జీలను వసూలు చేయడం ఆపాలి.

-ప్రసాద్‌రెడ్డి, పులివెందుల

పెనుభారంగా మారాయి

నెల నెలా పెరుగుతున్న ఛార్జీలు భారంగా మారాయి. అదనపు చార్జీల పేరుతో కరెంట్ బిల్లు ప్రతినెలా పెరుగుతుంది. పేదలు ఈ ప్రభుత్వంలో బతకడమే కష్టమవుతోంది. ఇటు నిత్యావసర ధరలు, కూరగాయల ధరలతో అల్లాడుతున్నాం. పైగా విద్యుత్ ఛార్జీలు భారంతో ఖర్చులు తడిసి మోపెడవుతోంది.

-శాంతయ్య- జమ్మలమడుగు.

సంపాదనలో సగం బిల్లుకే

సర్దుబాటు పేరుతో ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచింది. ప్రతి వినియోగదారుడిపై అదనంగా భారం పడింది. ఇప్పటి వరకు ప్రతి నెలా రూ.600 విద్యుత్తు బిల్లు చెల్లిస్తున్నా. ఏకంగా రూ. 900 బిల్లు వచ్చింది. ఒకేసారి రూ.300 పెరిగితే సంపాదించిన డబ్బంతా విద్యుత్ ఛార్జీలకే సరిపోతుంది.

-బి.ఓబులేసు, ప్రొద్దుటూరు.

8 సార్లు ఛార్జీలు పెంచింది

వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత 8 సార్లు ఛార్జీలు పెంచింది. గతంలో రూ. 1000 లోపల విద్యుత్ బిల్లులు వచ్చేవి. గత నెలలో రూ.2300 బిల్లు ఇచ్చి, అదనంగా రూ. 2 వేలు వేసి కట్టమని చెబుతున్నారు. అధికారులను అడిగితే' మాకు తెలియదంటున్నారు. వెంటనే అదనపు వసూళ్లను ఆపాలి.

-ఎన్.లక్ష్మిదేవి, గృహిణి, రాయచోటి.

ప్రజలపై అదనపు భారం

ప్రజలపై విద్యుత్ భారం తీవ్రంగా ఉంది. అద్దె ఇంటిలో నివసించే వారికి విద్యుత్ ఛార్జీలు పెనుభారంగా మారాయి. ఇంటి బాడుగలు కట్టలేక అతలాకుతలం అవుతున్నారు. సర్దుబాటు, ట్రూఅప్, సర్, కస్టమర్ ఛార్జీలు, అదనపు లోడ్ డిపాజిట్లు.. ఇలా వివిధ రూపాల్లో ప్రభుత్వం ప్రజల నడ్డి విరుస్తోంది.

-డి.ప్రభాకర్‌రెడ్డి, టాక్సీ స్టాండ్ ప్రెసిడెంట్, మదనపల్లె.

మోటర్లకు మీటర్లు సరికాదు

ప్రభుత్వం ఒకవైపు విద్యుత్ ఛార్జీలు పెంచుతూ మరో వైపు మోటర్లకు మీటర్లు బిగిస్తాననడం సరికాదు. మా వ్యవసాయ భూములకు మీటర్లు అమర్చేందుకు పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్, జిరాక్స్ తీసుకున్నారు. నగదును మీ అకౌంట్‌లో బదిలీ చేస్తామని అధికారులు చెబుతున్నారు. నగదు బదిలీపై నమ్మకం లేదు.

-శ్రీరాములు, బి.కొత్తకోట

ఛార్జీలు పెంచడం దారుణం

విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెరగడం చాలా దారుణం. కూలీ నాలీ చేసుకొని కష్టపడి కష్టపడి సంపాదించిన డబ్బులు విద్యుత్, గ్యాస్ బిల్లులకే పోతే జీవనం ఎలా సాగించాలో అర్థం కావడం లేదు. . గత నెలలో కంటే మరుసటి నెలలో దానికి డబల్ బిల్లు వస్తోంది. కరెంట్ షాక్ కొట్టినట్టు అయింది. ఎక్కువ యూనిట్లు కాల్చకపోయినా మీటర్ రీడింగ్ ఎక్కువగా చూపించి వసూలు చేస్తున్నారు.

- జానీ కుమార్, రాజారెడ్డివీధి, కడప.

బిల్లులు కట్టలేక చస్తున్నాం

విద్యుత్ బిల్లులు రోజురోజుకూ పెరుగుతుండడంతో కట్టలేక చస్తున్నాం. ఈ ఏడాదిలోనే రెండుసార్లు బిల్లులు పెంచేశారు. నెలనెలా పెరుగుతన్న కరెంటు బిల్లు చూసి, ఇంట్లో ఆడవాళ్లను అరవడం, వారు బాధపడ్డం పరిపాటిగా మారింది. వచ్చిన కరెంటు బిల్లు చూసి తామే సర్దుకుపోక తప్పడం లేదు. చాలీచాలని ఆదాయాలతో బతుకుతున్న సగటు కుటుంబాలకు పెరుగుతున్న బిల్లులు భారంగా మారు తున్నాయి.

-షేక్ అహ్మద్ బాష, ఆటో కార్మికుడు, పీలేరు.

పరిహారం చెల్లింపులు వేగవంతం చేయాలి

- జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో జాతీయ రహదారులకు సంబంధించి నిర్వాసితులకు రూ.79.75 కోట్ల భూ పరిహారం పంపిణీ వేగంగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆర్‌డిఒలు, తహశీల్దార్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలో చేపట్టిన జాతీయ రహదారులకు సంబంధించి నిర్వా సితులకు పరిహారం చెల్లింపు, పెండింగ్ భూసేకరణ అంశాలపై సంబంధిత ఆర్డీఓలు, తాసిల్దార్లు, ఎన్‌హెచ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఎన్‌హెచ్ 716 కడప నుండి రేణిగుంట జాతీయ రహదారికి సంబంధించి మొత్తం భూసేకరణ పూర్తి చేయడం జరిగిందని, భూసేకరణ పరిహారం మొత్తం రూ.98 కోట్లు చెల్లింపు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు రూ.73 కోట్లు చెల్లించారని ఇంకనూ రూ.25 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. ఎన్‌హెచ్ 440 రాయచోటి-వేంపల్లికి సంబంధించి రూ.33 కోట్లు చెల్లించాల్సి ఉండగా రూ.20 కోట్లు చెల్లించడం జరిగిందని, ఇంకను రూ. 13 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. ఎన్‌హెచ్ 71 మదనపల్లి నుండి పీలేరుకు సంబంధించి ఇంకనూ రూ.20 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. అదేవిధంగా ఎన్‌హెచ్ 42 మదనపల్లి నుండి మొలకలచెరువుకు సంబంధించి 12 హెక్టార్ల భూసేకరణ పెండింగ్లో ఉందని, ఈ ప్రాజెక్టుకు సంబంధించి కూడా ఇంకనూ రూ.20 కోట్లు పరిహారం చెల్లించాల్సి ఉందన్నారు. రైల్వే ఓవర్ బ్రిడ్జిలకు సంబంధించి లెవెల్ క్రాసింగ్ 119 లో భూ సేకరణ పూర్తి చేశారని, ఇందులో ఇంకను రూ.1.75 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. లెవెల్ క్రాసింగ్ 120లో ఇంకను 0.24 హెక్టార్ల భూసేకరణ చేయాల్సి ఉందని త్వరగా

సమావేశంలో మాట్లాడుతున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

భూసేకరణ పూర్తి చేయాలని రాయచోటి ఆర్‌డిఒను ఆదేశించారు. లెవెల్ క్రాసింగ్ 95కు సంబంధించి సిటిఎం గ్రామంలో భూసేకరణ త్వరితగతిని పూర్తి చేయాలని మదనపల్లి ఆర్‌డిఒను ఆదేశించారు. జిల్లా మొత్తంగా జాతీయ రహదారుల అంశానికి సంబంధించి పరిహారం చెల్లింపులలో 65 శాతం మేర ప్రగతి సాధించారని, వచ్చే వారంలోగా 80 శాతం ప్రగతిని తప్పనిసరిగా సాధించాలని ఆదేశించారు. ఇంకను పెండింగ్ ఉన్న భూసేకరణను త్వరితగతిని పూర్తి చేయాలని తాసిల్దార్లను ఆదేశించారు. భూసేకరణను ఆర్‌డిఒలు స్వయంగా పర్యవేక్షణ చేయాలని పేర్కొన్నారు. అనంతరం ప్రాజెక్టు వారీగా సాధించిన ప్రగతి, పరిహారం చెల్లింపు, కోర్టు కేసులు, పెండింగ్ ఫైల్స్ తదితర అంశాలను సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. సమావేశంలో డిఆర్‌ఒ సత్యనారాయణ, రాయచోటి, మదనపల్లి ఆర్‌డిఒలు రంగస్వామి, మురళి, ఎన్‌హెచ్ అధికారులు, తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

కనుల పండువగా రథోత్సవం

రథోత్సవంలో పాల్గొన్న భక్తులు, ప్రజలు

ప్రజాశక్తి-నందలూరు

జిల్లాలో ప్రసిద్ధి గాంచిన చారిత్రాత్మక శ్రీ సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా 8వ రోజు బుధవారం మధ్యాహ్నం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ సౌమ్యనాథ స్వామి రథోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. వేద పారాయణులు సంతోష్ కృష్ణ శర్మ ఆధ్వర్యంలో టిటిడి అర్చకులు సునీల్ కుమార్ శర్మ, సాయి కృష్ణ శర్మ, బాలస్వామి, రుత్వికులు శ్రీనివాస్, ఎంజి కృష్ణ తరుణ్ పార్థసారథి, భార్గవ్, సీతారాం, ప్రశాంత్, మనోజ్ కుమార్, పవన్ ఆచార్యులు మంత్రోచ్చారణ నడుమ భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ముందుకు సాగనంపారు. రథోత్సవానికి పెద్ద ఎత్తున హాజరైన భక్తులు గోవింద నామస్మరణలతో మాడవీధులు మారుమ్రోగాయి. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. రాజంపేట డిఎస్‌పి చైతన్య ఆధ్వర్యంలో సిఐ పుల్లయ్య, నందలూరు ఎస్‌ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పోలీసులతో భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు ఇవ్వకుండా పెద్దఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. రథోత్సవానికి వచ్చిన భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రాత్రి అశ్వ వాహనంపై మాడవీధులలో శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథుడు భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి, ఆకేపాటి అనిల్ కుమార్‌రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ అరిగెల సౌమిత్రి, సర్పంచ్ జంబు సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ భూమన శివశంకర్‌రెడ్డి, సోమిశెట్టి ప్రభాకర్, పెనుబాల నాగసుబ్బయ్య, గుణ యాదవ్, సినీ నటుల వేణుగోపాల్, కాకి చంద్ర అరిగే నాని, టిటిడి అధికారులు పాల్గొన్నారు.

నేడు చక్రస్నానం : బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ఇఒ నటేషన్ తెలిపారు.

36 గంటల ధర్నాను జయప్రదం చేయండి

- పోస్టర్ ఆవిష్కరణలో సిఐటియు, అంగన్వాడీ నాయకుల పిలుపు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఐసిడిఎస్‌ను పరిరక్షించాలని, అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పెన్షన్, పిఎఫ్, ఇఎస్‌ఐ, గ్రాడ్యూటీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10, 11న నిర్వహించే 36 గంటల ధర్నా జయప్రదం చేయాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, డి.భాగ్యలక్ష్మి, జిల్లా కోశాధికారి పి.బంగారుపాప, జిల్లా ఉపాధ్యక్షులు పిఖాజాబి, జిల్లా కార్యదర్శి ఎస్.ఓబులమ్మ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు పిలుపు నిచ్చారు. బుధవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో ధర్నా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని కలెక్టరేట్ల ఎదుట నిరసన ధర్నాలు ఉంటాయని చెప్పారు. ఈ నెల 10న అంగన్‌వాడీల కోర్కెల దినోత్సవమని తెలిపారు. అఖిల భారత కమిటీ పిలుపు మేరకు నిరసన తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. బిజెపి 9 సంవత్సరాల పాలనలో అంగన్‌వాడిల సమస్యలు పరిష్కరించలేదని చెప్పారు. ఐసిడిఎస్ లక్ష్యానికి విరుద్ధంగా సెంటర్లు కుదించడం, నూతన విద్యావిధానాన్ని తీసుకువచ్చి ఇబ్బందులకు గురి చేస్తున్నారని

36 గంటల ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

విమర్శించారు. ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగడం లేదని తెలిపారు. కనీస వేతనం రూ.26 వేలివ్వాలని, ఇఎస్‌ఐ, ఇపిఎఫ్ అమలు చేయాలన్నారు. విధి నిర్వహణలో చనిపోయిన అంగన్వాడీల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని పేర్కొన్నారు. పై సమస్యల పరిష్కారానికి జరిగే 36 దీక్షను జయప్రదం చేయాలని కోరారు. మరిన్ని డిమాండ్స్‌తో నిరసన ధర్నా నిర్వహిస్తున్నామని చెప్పారు. ధర్నాకు అంగన్వాడీలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వై.వెంకటరమణ, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

అనుమతిలేని విత్తనాలమ్మితే చర్యలు : జెసి

ప్రజాశక్తి రాయచోటి

ప్రభుత్వ అనుమతి లేని విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు అమ్మితే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్లోని స్పందన హాల్లో జిల్లా వ్యవసాయ శాఖ, విజిలెన్స్ శాఖ ఆధ్వర్యంలో పెస్టిసైడ్స్, ఫర్టిలైజర్స్, సీడ్స్ వ్యాపార దుకాణదారులకు, డీలర్లకు పురుగు మందులు, విత్తనాలు, ఎరువులు చట్టాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్సు లేకుండా పురుగు మందులు, ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ప్రతి దుకాణదారుడు విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు కొన్న రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. గ్రామాల్లో లూజ్ విత్తనాలు అమ్మరాదని, ఎవరైనా అమ్మితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దుకాణదారులు ప్రభుత్వం నిర్దేశించిన

సమావేశంలో మాట్లాడుతున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ఎంఆర్‌పి ధరల ప్రకారం విక్రయించాలని సూచించారు. అధిక ధరలకు అమ్మినట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవన్నారు. రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్‌పి షేక్ మాసుంబాష మాట్లాడుతూ డీలర్లు చట్టాన్ని అతిక్రమించకుండా వారి వ్యాపారాలను న్యాయబద్ధంగా చేసుకుంటూ, నాణ్యమైన విత్తనాలను ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు సరైన సమయంలో అందేలా చూడాలని, రైతుల పక్షాన నిలబడి వారి అభివృద్ధికి సహకరించాలని సూచించారు. వ్యవసాయ శాఖ జిల్లా అధికారి బి.చంద్ర నాయక్ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన ఉత్పత్తులు మరియు సరైన ధర అందించేలా కృషి చేయమని సూచించారు. స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు సరి చేయాలన్నారు. విత్తనాలు తీసుకున్న రైతుకు బిల్లు తప్పనిసరిగా ఇవ్వలన్నారు. కాలం చెల్లిన విత్తనాలను ఎట్టి పరిస్థితిలో అమ్మకూడదన్నారు. విత్తన చట్టం ప్రకారం అన్ని నియమనిబంధనలు పాటించాలన్నారు. సదస్సులో ఎడిఎ మజీద్ అహ్మద్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ జి.ఇదురుబాష, డిఎఒ ఆఫీస్‌లోని క్వాలిటీ కంట్రోల్ ఎఒ బి వెంకట మోహన్, విజిలెన్స్ ఎఒ బాలగంగాధర్‌రెడ్డి, వ్యవసాయ సహాయ సంచాలకులు, జిల్లాలోని డీలర్లు పాల్గొన్నారు.

'ఇళ్ల నిర్మాణాల్లో జిల్లాను మొదటి స్థానంలో నిలపాలి'

ప్రజాశక్తి-రాయచోటి

హౌసింగ్ అధికారులు సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఇళ్ళ నిర్మాణాలలో అన్నమయ్య జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ హౌసింగ్ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్లోని స్పందన హాల్లో రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ 45వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ జగనన్న హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలలో అన్నమయ్య జిల్లా ప్రస్తుతం నాలుగో స్థానంలో ఉందని పేర్కొన్నారు. రాబోయే రోజులలో హౌసింగ్ అధికారులు సిబ్బంది సమన్వయంతో పనిచేసి జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం నవరత్నాలు పేదలందరికి ఇళ్ళు పథకం ద్వారా రూ.3 లక్షల నుండి 18 లక్షల వార్షిక ఆదాయం ఉన్న మధ్య తరగతి, ప్రభుత్వ ఉద్యోగులకు ఎంఐజి లేఅవుట్ల ద్వారా ప్రజల సొంతింటి కలను నిజం చేస్తున్నారని కొనియాడారు. ముఖ్యంగా రాష్ట్రంలో గూడు లేని ప్రతి పేదవాడికి పక్క ఇల్లు నిర్మించే బాధ్యత నిర్వహిస్తున్న గృహ నిర్మాణ సంస్థ సిబ్బంది చేసుకున్న అదృష్టమని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముందు హౌసింగ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ రక్తదానం చేశారు. పలువురు అధికారులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణ సంస్థ ఉద్యోగులకు నిర్వహించిన వివిధ క్రీడా పోటీలలో గెలుపొందిన విజేతలకు ప్రశంసా పత్రాలు, మెమొంటోలను ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శివయ్య, కలెక్టరేట్ ఎఒ బాలకృష్ణ, ల్యాండ్ అండ్ సర్వే ఎడి జయరాజు, గ్రామ వార్డు సచివాలయాల జిల్లా కో-ఆర్డినేటర్ మనోహరాజు, జిల్లాలోని హౌసింగ్ ఇఇ, డిఇలు, ఎఇలు, వర్క్ ఇన్స్పెక్టర్లు డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

138 మందికి కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

శ్రీ షిరిడిసాయి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య పరీక్షలకు విశేష స్పందన లభించింది. తిరుపతి అరవింద్ కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఈ ఉచిత వైద్య పరీక్షల్లో 138 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు. అలాగే వీరిలో 48 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు వైద్యులు వినయశ్రీ, ఆకాష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతల ఆనంద రెడ్డి, నీళ్లభాస్కర్, కేశవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా రాబిస్ టీకాలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రపంచ సంక్రమిత వ్యాధుల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాలలో గురువారం పెంపుడు కుక్కలకు ఉచిత రాబిస్ టీకాలు వేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని పెంపుడు కుక్కల పోషకులు, పశుకాపరులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ కె.ప్రతాప్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా పశువుల నుండి మనుషులకు సంక్రమించే వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి వివరించడం జరుగుతుందని అన్నారు. కావున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య : ఎంఇఒ

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్యను అందిస్తున్నామని ఎంఇఒ-1 వెంకటరత్నం అన్నారు. బుధవారం ఆయన నూతనంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా యూటిఎఫ్ నాయకులు ఎంఇఒ వెంకటరత్నంను కలుసుకొని, పూలమాల వేసి, దుశ్శాలువతో సత్కరించారు. ఎంఇఒ మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని, మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడా ఏ సమస్య లేకుండా నాడు నేడు పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటిఎఫ్ నాయకులు బాలాజీ, నాగరాజ, హరి, బసంత్ కుమార్, వెంకట నారాయణ, అనిల్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిశువులకు టీకాలు శ్రీరామ రక్ష

ప్రజాశక్తి-పీలేరు

వ్యాధుల నుంచి శిశులను రక్షించే వ్యాధి నిరోధక టీకాల విస్తృత ప్రయోజనాల గురించి పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని డాక్టర్ రమేష్‌రెడ్డి సిబ్బందికి తెలిపారు. బుధవారం పీలేరు పట్టణంలోని కావలిపల్లె సచివాలయంలో నిర్వహిస్తున్న జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రమేష్‌రెడ్డి తనిఖీ చేశారు. శిశువులకు సోకే ప్రమాదకర వ్యాధుల నివారణ కోసం ముందే నిర్వహించే జాతీయ వ్యాధి నిరోక టీకాల కార్యక్రమం మెరుగైన లక్ష్యాలు సాధించడానికి తరచూ గృహ సందర్శనలు చేస్తూ, త్వరితగతిన జనన నమోదులు చేస్తూ ప్రభుత్వ ఉచిత ఆరోగ్య సేవల్లో ఒకటైన వ్యాధి నిరోధక టీకాలు ప్రతి బిడ్డ సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తల్లి-బిడ్డ సమాచారం నింపిన ఎంసిపి కార్డును తక్షణం జారీ చేయాలని చెప్పారు. టీకాల శిబిరానికి రాని పిల్లలను రప్పించేందుకు ప్రయత్నించాలని తెలియజేశారు. టీకాలు వేయించుకుంటే ముందు తరాలకు వ్యాధి రహిత బలమైన శిశువును సమాజానికి అందించవచ్చని అన్నారు. కావున ప్రజల అవగాహన కోసం పోస్టర్లు, బ్యానర్లు, వంటి ప్రచార మాధ్యమాలను ఉపయోగించాలని వైద్య సిబ్బందికి సూచించారు. తరువాత రికార్డులు, రిపోర్టులు తనిఖీ చేసి, సూచన సలహాలను ఇచ్చారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, ఎఎన్‌ఎం లక్ష్మి, వెంకటరత్నం, ఆశ కార్యకర్త సులోచన తదితరులు పాల్గొన్నారు.

'పది' ఫెయిలైన విద్యార్థులకు సువర్ణావకాశం

- మదనపల్లె డివైఇఒ కృష్ణప్ప

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పది ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రభుత్వం సువర్ణావకాశం కల్పించినట్లు మదనపల్లె ఉప విద్యాధికారి కృష్ణప్ప, మండల విద్యాధికారి రాజగోపాల్ తెలిపారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి వారు హాజరైన వారు మాట్లాడుతూ విద్యారంగంలో ప్రభుత్వం విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కొరకు అనేక పథకాలను తీసుకొచ్చిందన్నారు. గ్రాస్ ఎన్‌రోల్ మెంట్ వందశాతం సాధించేందుకు ప్రభుత్వం ఓ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకొని ఫెయిలైన విద్యార్థులను మళ్ళీ బడిలో చేర్పించాలన్నారు. వారికి ప్రభుత్వ పరంగా అందాల్సిన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా గతేడాది పదో తరగతిలో ఫెయిలైన నలుగురు విద్యార్థులు మళ్ళీ పాఠశాలలో చేరినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులను పాఠశాలలో చేర్చుకుంటున్న అధికారులు

అంగన్వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపిపి శ్రీదేవి రవికుమార్

అంగన్వాడీ కేంద్రంలో ఎంపిపి తనిఖీ

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని కలకడ సచివాలయం పరిధిలో స్థానిక ఇందిరమ్మ కాలనీలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని మంగళవారం ఎంపిపి శ్రీదేవి రవికుమార్ తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రంలో విద్యార్థుల హాజరు, రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు సక్రమంగా ఉన్నాయా లేదా అని ఆరాతీసి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ చిన్నారులకు మెనూ ప్రకారం భోజనాలు అందించాలని సూచించారు. విద్యార్థులకు అందిస్తున్న గుడ్డు కాల పరిమితి చెల్లిందా లేదా అని పరిశీలించి కోవాలని కార్యకర్తలను ఆదేశించినట్లు చెప్పారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్న తీరును పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త ఎల్లమ్మ, తేజస్విని, పిల్లలు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని తొలగించండి

ప్రజాశక్తి-సుండుపల్లి

రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభం

మండల కేంద్రం సుండుపల్లిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని స్థానిక ప్రజలు పేర్కొన్నారు. ఈ మధ్యకాలంలో రూ.9 లక్షల వ్యయంతో ఈదారిలో సిసి రోడ్డుకు నిర్మించారు. కానీ రోడ్డు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని మాత్రం తొలగించ లేదన్నారు. సంబంధిత విద్యుత్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించ లేదన్నారు. రాత్రి వేళలో ఈరోడ్డు వెళ్ళాలంటే భయంగా ఉందని రోడ్డుకు అడ్డంగా ఉన్న స్తంభాన్ని ఢీ కొని ప్రమాదాలు జరిగిన సంఘటలు కూడా ఉన్నాయన్నారు. లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి ప్రభుత్వం సిసి రోడ్డును వేయించిన ప్రభుత్వం, ప్రజల రాకపోకలకు అడ్డంగా ఉండే స్తంభాన్ని తొలగించుటకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రెస్‌క్లబ్ పనులు పూర్తి చేయండి

ప్రజాశక్తి-రాజంపేట రూరల్

అసంపూర్తిగా ఉన్న ప్రెస్‌క్లబ్ పనులను వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి కాంట్రాక్టర్లను ఆదేశించారు. పత్రికా, మీడియా ప్రతినిధులు ఎమ్మెల్యేని కలిసి అసంపూర్తిగా ఉన్న ప్రెస్‌క్లబ్ పనులను ఆయన ఆయన దృష్టికి తీసుకెళ్లారు. డివిజన్ కేంద్రమైన రాజంపేటలో ప్రెస్‌క్లబ్ లేకపోవడంతో మీట్ ద ప్రెస్‌కు అవకాశం లేదన్నారు. స్పందించిన ఎమ్మెల్యే కాంట్రాక్టర్‌తో చర్చించి పనులను మొదలుపెట్టి వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. జర్నలిస్టులకు ఇంటి స్థలంతో పాటు ఇళ్ల మంజూరు చేయిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో పాత్రికేయులు గుండ్రాతి విజయకుమార్, మలిశెట్టి సుబ్బనరసింహులు, త్రివిక్రమం, జయరాజ్, గణేష్, కళ్యాణ్ బీదంబ సుబ్బారావు పాల్గొన్నారు.

జెఎన్‌టియు ప్రిన్సిపల్‌గా వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-కలికిరి

బాధ్యతలు చేపడుతున్న వెంకటేశ్వరరావు

కలికిరి జెఎన్‌టియు కళాశాల నూతన ప్రిన్సిపల్‌గా ప్రొఫెసర్ ఎం.వెంకటేశ్వర్రావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహించిన డాక్టర్ ఎం.వి సత్యనారాయణ బదిలీపై అనంతపురం జెఎన్‌టియుకు ప్రిన్సి పల్‌గా వెళ్ళారు. ఆయన స్థానంలో ఇక్కడే ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ఎం వెంకటేశ్వర రావు ప్రిన్సిపల్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రిన్సి పల్‌గా బాధ్యతలు చేపట్టడం ఎంతో సంతోషంగా ఉందని, కళాశాల అభివృద్ధికి ఇతర అధ్యాపక బృందంతో కలిసి మరింత అభివృద్ధి చేయడానికి నా వంతు కృషి చేస్తానని తెలిపారు. బదిలీ అయిన డాక్టర్ ఎంవి.సత్యనారాయణకు కళాశాల సిబ్బంది సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ షేక్ నజీరా, ఎన్ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ అపర్ణ, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎఎన్ఎం కుటుంబాన్ని ఆదుకుంటాం

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని ప్రభుత్వ ఉపవైద్యశాలలో కాంట్రాక్ట్ ఎఎన్ఎంగా పనిచేస్తున్న సుజాత మార్చి నెల పదో తేదీన మృతి చెందారు. ఆమె అనారోగ్య కారణంగా మృతి చెందడంతో వైద్యాధికారి డాక్టర్ సృజన రాజంపేట డిప్యూటీ డిఎంహెచ్ఒ చెన్నకృష్ణకు తెలిపారు. బుధవారం ఆయన ఆరవపల్లిలో సుజాత గృహాన్ని సందర్శించారు. ఎఎన్ఎం తల్లిని, బంధువులను మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నుంచి సుజాతకు రావాల్సిన రూ.2లక్షలు అందిస్తామన్నారు. పత్యేకంగా రూ.3లక్షల ఆర్థిక సాయం ఉన్నతాధికారులకు నివేదించి ఎఎన్ఎం కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఒ ఆనరబుల్ ప్రెసిడెంట్, మాజీ సిహెచ్ఒ పిల్లి పిచ్చయ్య, యుడిసి సిద్ధరామయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులకు భోజనాన్ని వడ్డిస్తున్న రీజెన్సీ పాఠశాల అధినేత జి.ఎన్.నాయుడు

అన్నదానం గొప్పది

నందలూరు : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చారిత్రాత్మక శ్రీసౌమ్యనాథస్వామి రథోత్సవం సందర్భంగా పట్టణంలోని రీజెన్సీ నలంద పాఠశాలల అధినేత జి ఎన్.నాయుడు సౌజన్యంతో శ్రీసౌమ్యనాథ అన్నదాన ట్రస్ట్‌లో భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షులు ఎద్దుల సుబ్బరాయుడు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా రథోత్సవం సందర్భంగా జిఎన్ నాయుడు అన్నదానం ఏర్పాటు చేయడం హర్షనీయమని అన్నారు. అఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వెంకటనరసయ్య, మురళి, సౌమ్యనాథ స్వామి ఆలయ మాజీ చైర్మన్ పల్లెసుబ్రహ్మణ్యం, ట్రస్ట్ కోశాధికారి చక్రాల రామసుబ్బన్న, గ్రామ నాయకులు గంటా వాసుదేవయ్య, జంగంశెట్టి సుబ్రహ్మణ్యం, జంగంశెట్టి సుబ్బయ్య, లంకాయగారి సుబ్బరామయ్య, పెంచలయ్య పాల్గొన్నారు.

10న ఐటిఐలో జాబ్‌మేళా

వేంపల్లె : స్థానిక కందుల ఓబుల్‌రెడ్డి ఛారిటీస్ ఐటిఐలో ఈనెల 10న ఉదయం జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ఐటిఐ ప్రిన్సిపల్ ప్రసాద్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చైన్నైలోని పెనాసోనిక్, ఇండియా జపాన్ లైటింగ్, సూపర్ ఆటోఫోర్జ్ వంటి పెద్ద కంపెనీల్లో పని చేయడానికి అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో అభ్యర్థులు హాజరు కావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు జీతం రూ.15 వేలు ఉంటుందన్నారు. ఉచిత భోజనం, రవాణా, వసతి సౌకర్యం కల్పించనున్నట్లు ఆయన వివరించారు. వివరాలకు తమను సంప్రదించాలని ప్రిన్సిపల్ కోరారు.

30 పడకల ఆస్పత్రి ఏర్పాటయ్యేనా?

ప్రజాప్రతినిధులు మాట నిలుపుకుంటారా..!

ప్రజాశక్తి-సుండుపల్లి

పేద ప్రజలకు మెరుగైన వైద్యం కోసం మండల కేంద్రంలో 30 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయిస్తామని స్థానిక ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు ప్రజలకు హామీనిచ్చారు. 14 గ్రామ పంచాయతీలతో ఎక్కువ జనాభా కలిగిన మండలంగా సుండుపల్లి ఉంది. ఇక్కడ జనాభాను దృష్టిలో ఉంచుకొని ప్రజా ప్రతినిధులు, అధికారులు 30 పడకల ఆస్పత్రి నిర్మాణానికి కృషి చేస్తామని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సౌకర్యాలు లేకపోవడంతో ప్రజల ఆరోగ్యాన్ని సొమ్ము చేసుకునేందుకు ప్రయివేట్ ఆస్పత్రులు, ఆర్ఎంపి కేంద్రాలు పుట్టగొడుగుల్లా వెలసి వివిధ రకాల పరీక్షల పేరుతో ప్రజల నుంచి సొమ్ము చేసుకుంటున్నారు. అన్నమయ్య జిల్లా ఏర్పాటు అయ్యింది కానీ సుండుపల్లి మాత్రం ఏ మాత్రం అభివృద్ధి చెందలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. స్వాతంత్ర్యం పూర్వం నుంచి మండలానికి రాజకీయ చరిత్ర ఉందని, ఎంతో మంది ఈ ప్రాంతం నుంచి నాయకులు ఎదిగారు కానీ ప్రజలకోసం చిన్నపాటి 30 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేయించలేకపోతున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇక్కడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉదయం 8 నుంచి 12 గంటల వరకు మాత్రమే వైద్యులు ఒపి వైద్య సేవలు అందిస్తారన్నారు. తర్వాత వచ్చిన రోగులు ప్రయివేట్ ఆస్పత్రులకు వెళ్లి డబ్బు ఖర్చు పెట్టుకొని వైద్యం చేయించుకోవాల్సిందే. స్థానిక ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి కూడా స్పం దించి పేద ప్రజలకు మెరుగైన వైద్యం కోసం 30 పడకల ఆస్పత్రి ఏర్పాటు కు సహకరించాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించి 30 పడకల ఆస్పత్రి నిర్మాణం కోసం ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్ళి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అదించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సుండుపల్లెలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ప్రజాప్రతినిధులు మాట నిలుపుకోవాలి

30 పడకల ఆస్పత్రి నిర్మాణం కోసం ప్రజాప్రతినిధు ఇచ్చిన మాటనిలుపు కోవాలి. పదేళ్ళుగా అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళుతూనే ఉన్నాం. మెరుగైన వైద్య సేవలకు ప్రయివేట్ ఆస్పత్రులనే ఆశ్ర యించాల్సి వస్తోంది. మెరుగైన వైద్యసేవలు కల్పించి పేదలను ఆదుకోవాలి.

- ఎస్.శివరాణి, తిమ్మసముద్రం దళితవాడ

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 30 పడకల ఆస్పత్రిని నిర్మిస్తే పేదలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయి. ప్రయివేట్ ఆస్పత్రులు, ఆర్ఎంపి వైద్యులు పేదల ఆరోగ్యాన్ని సొమ్ముచేసుకుంటున్నారు. ప్రజా ప్రతినిధులు ఇచ్చిన మాట నెరవేరిస్తే మండల ప్రజల ఆకాంక్ష నెరవేరుతుంది.

- రాజేంద్ర, బాగంపల్లె కుప్పగుట్ట

జగనన్న సురక్షతో ప్రతి ఒక్కరికీ భరోసా : 'మేడా'

ప్రజాశక్తి-రాజంపేట రూరల్

లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే

జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను వారి ఇంటి వద్దకే వచ్చి అందిస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి తెలిపారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని బాలికల ఉన్నత పాఠశాలలో హైస్కూల్లో అమ్మవారి శాల ఈడిగపాలెం గ్రామ సచివాలయల పరిధిలో ఉన్న లబ్ధి దారులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను ఎమ్మెల్యే మేడా, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి అందించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కృపాకర్‌రావు, జెసిఎస్ కన్వీనర్ వడ్డే రమణ, రాజంపేట మున్సిపల్ వైస్ చైర్మన్ రవి, కౌన్సిలర్లు నవీన, తంబసుబ్రహ్మణ్యం, ప్రభుత్వ ఆస్పత్రి డైరెక్టర్ హస్తవరం ఉమామహేశ్వర్‌రెడ్డి, నాయకులు ఈశ్వరయ్య, జ్యోతియాదవ్, గోవింద, బాలాజీ, రోల్ల మడుగు సురేంద్ర పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** మండల పరిధిలతోని కోళ్లబైలు గ్రామ పంచాయతీ కురవంక లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎంపిటిసి బెల్లే హారతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతి థిగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా హాజరయ్యారు. ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో ఎంపిపి రెడ్డెమ్మ, వైస్ఎంపిపి రమణ, కురవంక సర్పంచ్ చలపతి, బిసి నాయకులు బెల్లేరెడ్డి ప్రసాద్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ తట్టి శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, డిఎల్‌డిఒ లక్ష్మి పతి, తహశీల్దార్ మహబూబ్‌చాన్, క్రిస్టియన్ సెల్ జిల్లా అధ్యక్షులు జాన్‌బాబు, మదనపల్లె మండల కన్వీనర్ కే.నాగరాజు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** మండలంలోని బడికాయలపల్లి పంచాయతీలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపిపి లక్ష్మీ నరసమ్మ, ఎంపిడిఒ శంకరయ్య,ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ మెంబెర్ ఎస్.నాసిర్ వల్లి, బడికాయలుపల్లి సర్పంచ్ ఆదెప్ప గౌడ్,ప్రత్యేక ఆహ్వానితులు రామిరెడ్డి,ఎంపిటిసి సుబ్బయ్య నాయుడు, తహశీల్దార్ రఫీక్ అహమ్మద్, ఎంపిడిఒ శంకరయ్య, వాలంటీర్లు ప్రజలు, పాల్గొన్నారు.**వాల్మీకిపురం**: జగనన్న సురక్షతో ప్రతి ఒక్కరికీ భరోసా వస్తుందని సర్పంచ్ గంగులమ్మ, ఉపసర్పంచ్ కేశవ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక సచివాలయం 2 పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి లాంటి సిఎం ఎవరూ లేరన్నారు. గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్య లక్ష్యసాధన, దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయ సాధనే లక్ష్యంగా సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు.కార్యక్రమంలో ఎంపిడిఒ షబ్బీర్ అహ్మద్, ఇఒ ఉదయ్ కుమార్, ఆర్‌బికే చైర్మెన్ నీళ్లభాస్కర్, ఎపిఒ ప్రసాద్‌బాబు, ఎంపిటిసి రాజేష్, సచివాలయ సిబ్బంది సుప్రియ, స్వర్ణ, వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సంక్షేమ పథకాల లబ్ధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

వైసిపి ప్రభుత్వంలో గత నాలుగు సంవత్సరాలగా ప్రతి ఇంటికి సంక్షేమ పథకాల లబ్ధి చేకూరుతోందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. బుధవారం రెడ్డివారిపల్లి పంచాయితీలోని పిట్టావాండ్లపల్లి, వడ్డిపల్లి, పిట్టావాండ్లపల్లి క్రాస్, ఎనుకొండవారిపల్లె, భవానినగర్ గ్రామాల్లో సర్పంచ్ రెడ్డమ్మ, వైసిపి నాయకులు నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపిపి నరసింహులు, సింగిల్ విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్ రెడ్డి, ఆర్‌బికె చైర్మన్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ రామమోహన్ రెడ్డి, వైసిపి మండల ఇన్‌ఛార్జి ఆర్ఐ రమణారెడ్డిలతో కలిసి ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం గత నాలుగేళ్లుగా అందించిన సంక్షేమ పథకాల బుక్ లెట్ ను లబ్ధిదారులకు అందించి, సంక్షేమ పథకాల ద్వారా పొందిన సాయాన్ని వివరించారు. ప్రజల సంతోషంగా ఉండడం చూడలేని ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వంపై బురదజల్లేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. ప్రజలు వారి మాటలు నమ్మొద్దని సూచించారు. అనుక్షణం ప్రజల కోసం పనిచేస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని, సిఎం జగన్‌ను ప్రజలు మరోసారి అధికారం చేపట్టేలా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు సుబ్రమణ్యం, చంద్రాయుడు, నాయకులు హరిబాబు, రామచంద్ర, రమణ, వెంకట రమణారెడ్డి, శ్రీరాములు, కృష్ణమూర్తి, దుర్గాప్రసాద్, విజయ్ కుమార్ రెడ్డి శశిధర్ రెడ్డి,డిటి సిరాజుద్దీన్, ఎఇలు హరినాథ్‌రెడ్డి, వసంత కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి : ఆర్‌ఆర్

మహిళలతో మాట్లాడుతున్న రమేష్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

తెలుగుదేశం పార్టీ హయాంలోని రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని 9వ వార్డులో నిర్వహించిన రాష్ట్ర భవిష్యత్‌కు చంద్రబాబు గ్యారంటీ, ఇదేంఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలోఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గం లో నిర్వహిస్తున్న రాష్ట్రానికి ఇదేమి కర్మ రచ్చబండ కార్యక్రమానికి యువత నుంచి మచి స్పందన వస్తోందన్నారు. నాలుగేళ్ల వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యమని అన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి అఖండ మెజార్టీతో విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ కలాడి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపిపిఉమాపతిరెడ్డి, ఎంపిటిసి రమణమ్మ,ముక్తర్‌అహ్మద్, పాల్గొన్నారు.

ఆధారాలు లేని ద్విచక్ర వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని వివిధ ప్రాంతాలలో విడిచి వెళ్లిపోయిన ఎలాంటి ఆధారాలు లేని ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు టూ టౌన్ సిఐ ఎస్. మురళీకృష్ణ తెలిపారు. పట్టణంలో ఇటీవల కాలంలో వివిధ ప్రాంతాలలో ఎవరో విడిచి వెళ్లిపోయినటువంటి ద్విచక్ర వాహనాలను పరిశీలించి ఎటువంటి ఆధారాలు లేనందున వాటిని సీజ్ చేసినట్లు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఉంచామని తెలిపారు. ఎవరి దగ్గరైనా సరైన రికార్డులుంటే వాటిని తీసుకువచ్చి స్టేషన్‌లో చూపిస్తే వాటిని పరిశీలించి వాహనాలకు సంబంధించిన రికార్డులు సక్రమంగా ఉంటే వాహనాలను అప్పగిసామన్నారు.లేకుంటే కోర్టు ఉత్తర్వుల మేరకు బహిరంగ వేలం పాటను నిర్వహించటం జరుగుతుందని తెలిపారు.

రైతు భరోసా కేంద్రంలో పరిశీలన

ప్రజాశక్తి-నందలూరు


రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

మండలంలోని నందలూరు-2 రైతు భరోసా కేంద్రాన్ని బుధవారం జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆర్‌బికె లోని రికార్డులను పరిశీలించారు. ఖరీఫ్‌లో వేసే పంటల వివరాల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేస్తున్న పంటలు, వాటికి అవసరమయ్యే విత్తనాలు, ఎరువుల వివరాలు గురించి సూచనలు అందించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి.మల్లికార్జున, వ్యవసాయ సహాయకులు షణ్ముఖ శ్రీనివాస్ పాల్గొన్నారు.

జర్నలిస్ట్ కాలనీకి తాగునీటి సరఫరా

ప్రజాశక్తి-పీలేరు

పట్టణంలోని పివి మిథున్‌రెడ్డి జర్నలిస్ట్ కాలనీకి సర్పంచ్ బిసి జయలక్ష్మీదేవి నీటి సరఫరా ప్రారంభించారు. స్థానిక తిరుపతి రోడ్డులోని ఎంఎన్ఆర్ గార్డెన్స్ సమీపంలోని కాలనీకి నీటి సరఫరా అవసరమని కోరిన వెంటనే బోడుమల్లువారిపల్లి పంచాయతీ సర్పంచ్ జయలక్ష్మి దేవి స్పందించి జర్నలిస్ట్ కాలనీలోని వీధులన్నింటికీ నిరందించేందుకు స్కీమ్ బోరుకు రూ.3.50 లక్షల పంచాయితీ నిధులు వెచ్చించి కొత్తగా మోటారు, స్టార్టరు, పైప్ లైన్, ఏర్పాటు చేయించి, ఇంటింటికీ కొళాయి కనెక్షన్ ఇప్పించారు. బుధవారం పూజలు నిర్వహించిన అనంతరం ఆమె స్టార్టర్ ఆన్ చేసి నీటి సరఫరాను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ జర్నలిస్ట్ కాలనీకి అవసరమైన సదుపాయాల కల్పనకు తాను పూర్తిస్థాయిలో సహకరిస్తానని తెలిపారు. గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారంలో జర్నలిస్టుల సహకారం అభినందనీయమన్నారు. మౌళిక వసతుల కల్పనకు తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు జ్ఞాన శేఖర్ రెడ్డి, కాలనీ చిన్న, పలువురు జర్నలిస్టులు పాల్గొని సర్పంచ్ కు కృతజ్ఞతలు తెలిపారు.

తాగునీటి కోసం స్టార్టర్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ జయలక్ష్మీదేవి

బదిలీపై ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-రామసముద్రం

మండలంలోని చెంబకూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గతంలో పని చేస్తూ బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు విష్ణుప్రియ అధ్యక్షతన ఘనంగా సన్మానించారు. బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు ప్రకాష్‌బాబు, భాస్కర్‌రెడ్డి, నాగవేని, రామ్మూర్తినాయుడు, శైలశ్రీ, చంద్రశేఖర్‌లు వున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతనంగా ఎంపికైన వారిని సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్‌గా రాము

ప్రజాశక్తి-నందలూరు

వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్-302 నందలూరు క్లబ్ ప్రెసిడెంట్‌గా మోడపోతుల రాము, జనరల్ సెక్రటరీగా జంగంశెట్టి హరిప్రసాద్, ట్రెజరర్‌గా గాడి సునీల్ రెడ్డి లను ఎంపిక చేసినట్లు వాకర్స్ ఇంటర్నేషనల్ డిప్యూటీ గవర్నర్ మన్నెం రామమోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూవాకర్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ట్రస్ట్ బోర్డు పర్సన్ ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు బుధవారం నియామకపత్రం అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ క్రీడా మైదానానికి పలుమార్లు మరమ్మత్తుల కొరకు మోడపోతుల రాము, జంగంశెట్టి హరిప్రసాద్‌లు తమ వంతు కృషి చేశారని చెప్పారు. అనంతరం నూతనంగా ఎంపికైన వారిని సత్కరించారు. కార్యక్రమంలో వాకర్స్ సభ్యులు కుర్రామణి యాదవ్, శ్యామనబోయిన గురుప్రసాద్, జంగంశెట్టి చంద్ర, ఆండ్రూస్ ఉప్పు శెట్టి సుధీర్, నడివీధి సుధాకర్, మారయ్య, రిలాక్స్ రామ చంద్రారెడ్డి, టైలర్ బాబు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ఫుల్‌బాల్ పోటీలకు ఎంపికైన ఉమేష్

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ఉమేష్‌రిషి

పట్టణం కొత్తబజారుకు చెందిన సోడిశెట్టి శేషు, మహేశ్వరి కుమారుడు ఉమేష్ రిషి అంతర్జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు తల్లిదండ్రులు తెలిపారు. మే నెల 26, 27, 28 తేదీలలో సంయుక్త భారతీయ ఖేల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఢిల్లీలో జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలు జరిగాయి. 13 రాష్ట్రాలు పాల్గొన్న ఆ పోటీలలో ఆంధ్రప్రదేశ్ ద్వితీయ స్థానం సాధించింది. అండర్-17 విభాగంలో జరిగిన ఈ పోటీలలో ఎపికి ప్రాతి నిధ్యం వహించి అత్యంత ప్రతిభ కనపరిచారు. ఉమేష్ ఋషి జూలై 30 నుంచి ఆగస్టు 5 వరకు దుబాయిలో జరగబోవు అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిన సందర్భంగా ఉమేష్ రిషిని పలువురు ప్రశంసించారు.

మహిళకు బంగారు నగల బ్యాగ్ అప్పగింత

ప్రజాశక్తి-పీలేరు

ఆటోలో నుంచి పడిపోయిన బంగారు నగల బ్యాగ్‌ను అర్బన్ సిఐ మోహన్‌రెడ్డి బుధవారం బాధితురాలికి అప్పగించారు. మూడు రోజుల క్రితం పట్టణంలోని ఎస్.విమెడికల్ షాప్ యజమాని రమేష్ తనకు దొరికిన బ్యాగును తన దగ్గరే భద్రపరిచాడని, దానికోసం ఎవరూ రాకపోవడంతో బుధవారం అతను స్థానిక పోలీస్ స్టేషనుకు వచ్చి అప్పగించినట్లు తెలిపారు. ఆ బ్యాగును, అందులోని సుమారు రెండు తులాల బంగారు నగలను బాధిత మహిళ హరితకు మెడికల్ షాప్ యజమాని రమేష్ సమక్షంలో అప్పగించినట్లు తెలిపారు. దొరికిననగలను దాచుకోకుండా నిజాయితీ పోలీసులకు అప్పగించిన మెడికల్ షాపు నిర్వాహకుడు రమేష్‌ను సిఐ అభినందించారు.

బాధితురాలికి నగల బ్యాగును అందిస్తున్న సిఐ మోహన్‌రెడ్డి

క్రైం కార్నర్

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మండలంలోని గట్టు పంచాయతీ, సీతవారిపల్లెకు చెందిన సుబ్బయ్య (45) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఏం జరిగిందో తెలియదు కానీ పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు.గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఘర్షణలో 10 మందికి గాయాలు

- తొమ్మిది మందిపై కేసు నమోదు

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని సరస్వతిపల్లి పంచాయతీ ఉడుమువారిపల్లికి చెందిన షేక్ అబ్దుల్ సలాం, అదే గ్రామానికి చెందిన అల్లాబకాష్ రెండు గ్రూపులుగా ఏర్పడి బుధవారం ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో పదిమందికి తీవ్ర గాయాలు కాగా 9 మంది పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు..మండలంలోని సరస్వతిపల్లి పంచాయతీ ఉడుము వారిపల్లి చెందిన వీరు ఇరువురు సమీప బంధువులేనని అన్నారు. గత కొంత కాలంగా స్థల వివాదమై గతంలో కూడా ఘర్షణ పడ్డారని తెలిపారు. బుధవారం అల్లాబకాష్ మద్యం సేవించి అబ్దుల్ సలాంను, వారి కుటుంబ సభ్యులను దూషించడంతో ఇరు వర్గాల వారు ఘర్షణ పడ్డారని తెలిపారు. ఘర్షణలో అబ్దుల్ సలాం, మస్తాన్, మహమ్మద్ గౌస్, దర్బార్‌లకు తీవ్ర గాయలు కాగా వీరిని చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలి పారు. మరో గ్రూపుకు చెందిన అల్లా బకాష్ తోపాటు సర్దార్ బాషా, నౌహిరా, రియాజ్‌లను చికిత్స నిమిత్తం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించినట్లు చెప్పారు. సర్దార్‌బాషా, ఖాదర్‌బాషా, ఖాదర్ హుస్సేన్ ఖాదర్‌బాషాలను పరిస్థితి విషమంగా ఉండటంతో బంధువులు కడప రిమ్స్ నుంచి తిరుపతికి తీసుకెళ్లారని పేర్కొన్నారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు.